
క్లుప్తంగా

ఎస్సైగా రాజేందర్ బాధ్యతల స్వీకరణ



దామెర : స్థానిక ఎస్సైగా ముత్యం రాజేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండు నెలలుగా ఆత్మకూర్ ఎస్సై గైకాడి అనిల్‌కుమార్ ఇన్‌చార్జి ఎస్సైగా విధులు నిర్వహిస్తుండగా రాజేందర్‌ను స్థానిక ఎస్సైగా నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

దళిత మహిళల నిరసన



నడికూడ : విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకుని సర్వీస్ రెగ్యూలరైజేషన్ చేసుకోకపోతే విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేస్తామని ఆ శాఖ అధికారులు ప్రకటించడంతో మండలంలోని నార్లాపూర్ గ్రామంలోని దళిత సామాజికవర్గానికి చెందిన మహిళలు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ మీటర్లతో సర్వీస్ రెగ్యులరైజేషన్ చేసుకుంటే ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు నెలకు 100 యూనిట్ల వరకు ఉచితంగా వినియోగించుకోవచ్చని, లేకుంటే విద్యుత్ చౌర్యం నేరం కింద చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. గత 45 ఏళ్లుగా ఏ ప్రభుత్వం కూడా దళితలను విద్యుత్ మీటర్ల విషయంలో వేధించలేదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అధికారులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

వెండి పట్టీలు, నగదు చోరీ



దర్యాప్తు చేస్తున్న ఎస్సై గుగులోతు వెంకన్న

ఐనవోలు : మండలంలోని కొండపర్తిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై గుగులోతు వెంకన్న కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎలిగేటి రమణారెడ్డి దంపతులు సోమవారం ఉదయం పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో ఉన్న 15 తులాల వెండి కాళ్ల పట్టీలు, రూ.4,200 నగదు కనిపించలేదు. దీంతో రమణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం, టెక్నికల్ టీంలు విచారణ చేపట్టాయి. ఎస్సై ప్రాథమిక ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

ఆర్థికసాయం



సాయం అందిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

శాయంపేట : మండలంలోని రాజుపల్లి గ్రామ పంచాయతీ పంప్ ఆపరేటర్ రాయరాకుల మొగిళికి అతడి తల్లి ఓదెమ్మ ఇటీవల మృతి చెందిన క్రమంలో సర్పంచ్ గజ్జెల లావణ్య రాజు సోమవారం రూ.4 వేలు సాయం అందించారు. అలాగే బాధిత కుటుంబానికి పంచాయతీ కార్యదర్శి పబ్బ సునీల్ రూ.2 వేలు సాయం చేశారు. వార్డు సభ్యులు చింత నిప్పుల నవత రమేష్, గొలుసుల సంధ్య దేవేందర్, బొల్లినేని తిరుపతిరావు, మునిపాక కుమారస్వామి, మాదారపు రాజేశ్వర్, కోఆప్షన్ సభ్యులు మునిపాక ఐల్లయ్య వెయ్యి రూపాయలు చొప్పున అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పరామర్శించారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న రవీందర్‌రావు, మధుమతి

ఐనవోలు : మండలంలోని పెరుమాండ్లగూడెం గ్రామానికి చెందిన తక్కళ్లపెల్లి రాధమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వీరి వెంట సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్‌రావు, మునిగాల సంపత్‌కుమార్, సర్పంచ్ జన్ను కుమారస్వామి, మాదారపు పూర్ణచందర్‌రావు తదితరులున్నారు.

మహిళలతోనే సమాజ పురోగతి

ఆత్మకూరు : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సమాజం పురోగతి సాధిస్తుందని ఎంపీపీ సుమలత తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రంగాల్లో రాణించాలని నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పురుషులకు దీటుగా విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లో ఎదుగుతున్నారని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పీహెచ్‌సీ) వైద్యురాలు స్పందన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారాల్లో 'ఆరోగ్య మహిళ' పేరుతో మహిళల కోసం ప్రత్యేక ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయనుందని చెప్పారు. జెడ్పీటీసీ రాధిక మాట్లాడుతూ మహిళలు ధైర్యాన్ని అలవర్చుకోవాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడుతూ స్త్రీ, పురుషులు సమానమేనన్న భావన కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం కేక్ కట్ చేసి మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, ఎంపీటీసీ భాగ్య తదితరులు పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రం సమీపంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో పలు విభాగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలను సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ కాగితాల శంకర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ యాదగిరి, ఏపీఓ శారద, ఏపీఎం రూప్సీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జంగం రాణి, పద్మావతి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, సర్పంచ్‌లు పురాణం రాజేశ్వరి, కుక్క శ్రావణ్య పాల్గొన్నారు.



దామెర : మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



శాయంపేట : ఏఎస్సైని సన్మానిస్తున్న సర్పంచ్



ఆత్మకూరు : మాట్లాడుతున్న ఎంపీపీ సుమలత

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కన్వీనర్ కలకోట్ల జ్యోతి అధ్యక్షతన బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఏఎస్సై శైలజను, కానిస్టేబుల్ స్వర్ణలతలను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కందగట్ల రవి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, అంగన్‌వాడీ టీచర్లు రత్నమాల, శ్వేత, రమ, పుష్ప, అరుణ, కానిస్టేబుళ్లు కృష్ణ, సతీష్, ఆశాకార్యకర్త రజిత పాల్గొన్నారు.

పరకాల : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఇందిరదేవి, డాక్టర్ అరుణ, సుస్మిత, పి.సుభాషిణి, జి.స్వప్న, డాక్టర్ ఎం.నవీన్, డాక్టర్ జి.ఓదేలు, డాక్టర్ రాజయ్య, అశోక్ మోరె, కుమారస్వామి, అనిల్ కుమార్, సంజయ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.



పరకాలలో..

'కంటి వెలుగు'తో లబ్ధి



ఆత్మకూరు : శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ



నడికూడలో..

ఆత్మకూరు : కంటి వెలుగు కార్యక్రమంతో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎంపీపీ మార్క సుమలత కోరారు. మండలంలోని తిరుమలగిరి గ్రామంలో సర్పంచ్ రంపీస మనోహర్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కంటివెలుగు కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ఉచితంగా కళ్లద్దాలు అందించడమే కాకుండా అవసరమైన శస్త్రచికిత్స చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక, వైద్య అధికారులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

నడికూడ : మండలంలోని వరికోల్‌లో కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ మచ్చ అనసూర్య ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆమెను అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



దామెరలో..

దామెర : కంటివెలుగు కార్యక్రమంతో సమస్యలు దూరమవుతాయని మండల వైద్యాధికారి డాక్టర్ మంజుల తెలిపారు. మండలంలోని దుర్గంపేట్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పురాణం రాజేశ్వరి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పురాణం ఈశ్వర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



శాయంపేట : మెడల్స్ సాధించిన విద్యార్థులతో స్పెషల్ ఆఫీసర్, ఉపాధ్యాయులు



దామెరలో..

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక శివారు పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల (కేజీబీవీ) విద్యార్థులు ఇంటర్ స్టేట్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్–2023లో ప్రతిభ చాటి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారని స్పెషల్ ఆఫీసర్ మాధవి తెలిపారు. సదరు విద్యార్థులను పాఠశాల ఆవరణలో స్పెషల్ ఆఫీసర్ మాధవి, పీఈటీ కావ్య, మార్షల్ ఆర్ట్స్ నిర్వాహకుడు మాస్టర్ రజనీకాంత్, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాధవి మాట్లాడారు. కాజీపేటలోని సెంట్ ఫ్రాన్సిస్ హైస్కూల్‌లో క్రీడా పోటీలు నిర్వహించగా విద్యార్థులు కల్పన, హర్షిత, శ్రావ్య, అనుష మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారని చెప్పారు. త్రివేణి, నవ్యశ్రీ, బ్రెస్లీ, రితిక, ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్, సింధుప్రియ, పూర్ణ, రజిత, చిన్నారి తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించారని చెప్పారు.

దామెర : హనుమకొండలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్థానిక ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు మనోజ్ఞ, వేవిశ్రీ, దివ్యశ్రీ, వర్శిత ప్రతిభ చాటి బంగారు పథకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తెలిపారు. శ్రీవాస్తవ, శ్రీవర్శిత, చందన, ప్రవళిక, వైష్ణవి రజత పథకాలు, నాగశ్రీ, రమ్యశ్రీ, అక్షిత బ్రాంజ్ మెడల్స్ సాధించారని చెప్పారు. సదరు విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు కమలాకర్, కోచ్ అన్వర్‌పాషా, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.



పరకాల : ట్రోఫీ గెల్చుకున్న రితిక

'క్రియేటివ్' ఆధ్వర్యంలో..

పరకాల : క్రియేటివ్ కరాటే డూ ఆధ్వర్యంలో పరకాల పట్టణంలోని మయూరి గార్డెన్‌లో నిర్వహించిన 31వ అంతర్‌రాష్ట్ర ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ టైటిల్‌ను దక్కించుకుని పరకాల విద్యార్థులు గ్రాండ్ చాంపియన్లుగా నిలిచారు. కరాటే పోటీల్లో పరకాలకు చెందిన పోచంపల్లి రితిక సీనియర్ బాలికల విభాగాల్లో ప్రతిభ చూపి రెండు గ్రాండ్ చాంపియన్ షిప్ ట్రోపిలను గెలుచుకుంది. రితికను నిర్వాహకులు అభినందించారు.

చెరువులు, కుంటల వద్దకు వెళ్లొద్దు

● హోలీ సందర్భంగా ఫ్లెక్సీల ఏర్పాటు

పరకాల : హోలీ పండుగ నేపథ్యంలో యువకులు, చిన్నారులు చెరువులు, కుంటల వద్దకు వెళ్లొద్దని పరకాల సీఐ పుల్యాల కిషన్ కోరారు. ఏసీపీ శివరామయ్య ఆదేశాల మేరకు పలు చెరువులు, వాగుల వద్ద పరకాల పోలీసులు హోలీ సందర్భంగా సోమవారం ముందస్తు హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. హోలీ ఆడుకున్న అనంతరం స్నానాల కోసం చెరువులు, కుంటల వద్దకు వెళ్లిన క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. గతంలో ఈతరాని పిల్లలు, యువకులు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు చోటు చేసుకున్న క్రమంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు. తద్వారా ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.



వాగు వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయిస్తున్న సీఐ కిషన్

పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీ



హోలీ వేడుకల్లో విద్యార్థులతో ఎంఈఓ, టీచర్లు

కమలాపూర్ : మండలంలోని శంభునిపల్లి, భీంపల్లి, వంగపల్లి, మర్రిపల్లిగూడెం, లక్ష్మీపూర్, శనిగరం, వెంకటేశ్వర్లపల్లి, కమలాపూర్, కమలాపూర్‌లోని ఎస్సీ కాలనీ, టాకీస్ ఏరియా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో, కానిపర్తి, గుండేడు ప్రాథమికోన్నత పాఠశాలల్లో, వంగపల్లి, ఉప్పల్ బాలికల హైస్కూళ్లలో ఎంఈఓ రాంకిషన్ రాజు సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లోని ఎఫ్ఎల్ఎన్, మధ్యాహ్న భోజన రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. అనంతరం కమలాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ముందస్తు హోలీ వేడుకల్లో పాల్గొని ఉత్సాహం నింపారు. కార్యక్రమాల్లో సీఎస్ఓ ఎం.శివప్రసాద్, డీఆర్పీలు పీడబ్ల్యూసీ.పవన్‌కుమార్, ఎస్.ప్రకాష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల అందజేత



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల హైస్కూళ్లలోని పదో తరగతి విద్యార్థులకు ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు సామల వీరేశం జ్ఞాపకార్థం ఆయన కొడుకు, శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సామల భిక్షపతి సోమవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు వెంకటేశ్వర్‌రావు, సీతాలక్ష్మీ, ఉపాధ్యాయులు సదానందం, శ్రీనివాస్, శంకర్ బాయ్, కరుణ, కల్పన, నాగలత తదితరులు పాల్గొన్నారు.

గండ్ర దంపతుల సహకారంతో అభివృద్ధి



శాయంపేట : పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్



దామెర : భూమిపూజ చేస్తున్న నాయకులు

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి–జ్యోతి దంపతుల సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కొప్పుల సర్పంచ్ గోలి మహేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆ గ్రామంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితోపాటు ఆయన సతీమణి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సహకరిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే తాజాగా .20 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు మంజూరు కాగా పనులను ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మేకల శ్రీనివాస్, ఉపసర్పంచ్ అట్ల తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు సామల మధుసుధన్, మాజీ సర్పంచ్ తోట కుమారస్వామి, వార్డు సభ్యులు గర్రం సుధాకర్, మామిడి భద్రయ్య, నాయకులు వెంకన్న, తిరుపతి, ఆదిరెడ్డి, రవిపాల్‌రెడ్డి, భాస్కర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ

దామెర : మండలంలోని పులుకుర్తి గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు, ఉపసర్పంచ్ మెంతుల రాజు మాట్లాడారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చొరవతో ప్రత్యేక నిధులు మంజూరు చేయించి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందు అశోక్, ఎంపీటీసీ సంధ్య అశోక్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ముదిగొండ కృష్ణమూర్తి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాల్, ఎస్ఎంసీ చైర్మన్ దుర్శెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్



ఆత్మకూరు : ఇటీవల పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన మల్లారెడ్డి పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని అయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తన నియామకం పట్ల ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మల్లారెడ్డికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, రైతు కోఆర్డినేటర్ రవీందర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు వంగాల భగవాన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అంకూస్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రీతి' ఘటన బహుజనుల దుస్థితికి నిదర్శనం

ఆత్మకూరు : కేఎంసీ వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రీతి మృతి చెందిన ఘటన రాష్ట్రంలో బహుజనుల దుస్థితికి నిదర్శనమని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ అన్నారు. ప్రీతి మృతి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులందరిపైనా కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆ ఫ్రంట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బహుజన బిడ్డలకు రక్షణ కరువైందన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న బహుజన విద్యార్థుల పట్ల అగ్రకుల పెత్తందార్ల దౌర్జన్యాలు కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. ప్రీతిని అగ్రకులానికి చెందిన సైఫ్ కులం పేరుతో దూషించి అవమానించిన విషయం తెలిసి కూడా కేఎంసీ ప్రిన్సిపాల్, సదరు విభాగ హెచ్ఓడీ సరైన రీతిలో స్పందించకపోవడానికి కులవివక్షే కారణమన్నారు. ప్రీతి మృతిపై ఉన్న అనుమానాలను నిగ్గు తేల్చడంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, బాధ్యులందరినీ కఠినంగా శిక్షించి బహుజన బిడ్డల్లో ధైర్యాన్ని నింపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మాదాసి శ్రీనివాస్, మాదాసు రాజు, గిన్నారపు ప్రసంగి, గిన్నారపు మైబు, మేకల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న డీబీఎఫ్ నాయకులు

'బీజేపీ మాదిగల ప్రధాన శత్రువు'

ఐనవోలు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని మాదిగల ప్రధాన శత్రువుగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ అభివర్ణించారు. ఆ పార్టీ జిల్లా కన్వీనర్ గద్దల సుకుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన 'మాదిగల సంగ్రామ పాదయాత్ర' మండలంలోని కొండపర్తి గ్రామానికి సోమవారం చేరుకోగా ఎంఎస్పీ సీనియర్ నాయకుడు బొక్కల నారాయణ ఆధ్వర్యంలో స్వాగతం పలుకగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సర్పంచ్ కట్కూరి రాజమణి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి 2014లో ఓట్లు దండుకుని గద్దెనెక్కి తదనంతరం మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టి తొమ్మిదేళ్లు గడచినా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం లేదని మండిపడ్డారు. ఏప్రిల్ 4న తలపెట్టిన రాష్ట్ర రాజదాని దిగ్బంధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు, జిల్లా కోఆర్డినేటర్ గంగారపు శ్రీనివాస్, నాయకులు కట్కూరి ప్రవీణ్, బొడ్డు శాంతి సాగర్, జెరిపోతుల సతీష్, శనిగరపు రవీందర్, కట్కూరి రమేష్, జెరిపోతుల ఏసోబు, బొక్కల చిరంజీవి, మాదాసి వెంకటస్వామి, బొక్కల సురేష్, రవి కుమార్, కళ్యాణ్, ఎల్లేందర్, రాజు, శ్రీరామ్, శైలజ, భారతి తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర బృందంతో సర్పంచ్, తదితరులు

కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ అండ

ఎల్కతుర్తి : కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని కోతులనడుమ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త ఎర్రోళ్ల భిక్షపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా అతడి భార్య పద్మకు రూ.2 లక్షల పార్టీ సభ్యత్వ బీమా చెక్కును సోమవారం ఆయన అందజేసి మాట్లాడారు. కార్యకర్తల కుటుంబాలకు భద్రత కల్పించేలా బీమాను వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. భిక్షపతి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సర్పంచ్ రజిత దేవేందర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్, నాయకులు శేషగిరి, తిరుపతి, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

తురక కాశలను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆత్మకూరు : తురక కాశ మతస్తులను ఆదుకోవాలని తురక కాశ సంక్షేమ సంఘం (టీకేఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ వలీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 5 లక్షల మంది తురక కాశ మతస్తులున్నారని చెప్పారు. కొండల్లో, గుట్టల్లో గుడారాలు వేసుకుని బండలు కొడుతూ బతుకులు వెళ్లదీస్తున్నారని తెలిపారు. కూడు, గూడు, తదితర కనీస వసతులకు సైతం నోచుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. అన్ని కులాలకు, మతాలకు రిజర్వేషన్లు, రాజ్యాంగ ఫలాలు అందుతున్నా తురక కాశ మతస్తులకు ఎలాంటి ప్రయోజనమూ లభించడం లేదన్నారు. తురక కాశ మతస్తులకు విద్య, వైద్య, ఆర్థిక, తదితర సహకారం అందించాలని కోరుతూ ఐదేళ్లుగా ప్రభుత్వానికి, మంత్రులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా ఇప్పటివరకు స్పందన లేదని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తురక కాశ మతస్తుల కోసం రూ.200 కోట్లతో ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

పరకాల : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య కోరారు. పట్టణంలోని అమరధామం పార్క్‌లో సోమవారం ఆ యూనియన్ అనుబంధ యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించగా ఉప్పలయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక అనేక కార్మిక వ్యతిరేక కార్యక్రమాలకు తెగబడిందని విమర్శించారు. అనేక కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా, కార్మికులకు నష్టం కలిగించేలా సవరించిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీలో తలపెట్టిన మజ్దూర్, కిసాన్ సంఘర్ష ర్యాలీకి జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండలం అధ్యక్షుడు సుధాకర్, కమిటీ సభ్యులు సారంగపాణి, ప్రభాకర్ పాల్గొన్నారు.